సాక్షి
కామారెడ్డి
సోమవారం । 16 । జూన్ । 2025



వడ్డీలు.. వేధింపులు

పల్లెల్లో మళ్లీ మైక్రో ఫైనాన్స్‌లు పడగ విప్పుతున్నాయి. అధిక వడ్డీలతో సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి.

- 8లో ▸



కల నెరవేరేనా?

తాడ్వాయిలో మూడు దశాబ్దాల క్రితం చేపట్టిన మినీ స్టేడియం ఇప్పటికీ బేస్‌మెంట్ దశ దాటలేదు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.1 /23.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మానవత్వం చాటుకున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్



భిక్కనూరు : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం ఆయన మెదక్ నుంచి కారులో భిక్కనూరుకు వస్తుండగా.. 44వ నంబర్ జాతీయ రహదారిపై కారు బోల్తా పడి ఉండడాన్ని గమనించారు. కలెక్టర్ సీసీ రాజశేఖర్ కుటుంబ సభ్యులు గాయపడ్డారు. దీనిని గమనించిన చంద్రకాంత్‌రెడ్డి గాయపడిన వారిని బయటకు తీయడంలో సహకరించి, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ రావడంలో ఆలస్యం కావడంతో తన కారులో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



కామారెడ్డి: ఆయకట్టు పంట పొలాలకు సాగు నీరు అందించే పంట కాలువలు, తూముల మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన జుక్కల్ మండలం పెద్ద ఏడ్గి శివారులోని పెద్ద చెరువు ప్రధాన కాలువ మరమ్మతు పనులను పరిశీలించారు. పంట కాలువ మరమ్మతులలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. ఆయకట్టు పంట పొలాలకు సాగు నీటికి ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): అర్హులైన రైతులు వ్యవసాయ పెట్టుబడి సహాయం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. ఈనెల 5వ తేదీలోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన రైతులు సంబంధిత గ్రామాలకు చెందిన వ్యవసాయ విస్తీర్ణాధికారుల వద్ద ఈనెల 20 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్‌లో పట్టాదారు డాటా డిజిటల్ సంతకం అయిన రైతులు కూడా రైతు భరోసా పథకానికి అర్హులే అని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, డిజిటల్ సంతకం అయిన పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంకు సేవింగ్ అకౌంట్ జిరాక్స్‌తో పాటు దరఖాస్తు ఫారంను ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

ఏడాదిలో ఎన్నో విజయాలు

- కలెక్టర్‌గా తన మార్క్ చూపిస్తున్న ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు
- వినతులపై ఎప్పటికప్పుడు సమీక్ష, సమస్యల పరిష్కారానికి చొరవ
- విధుల్లో నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు
- వివిధ రంగాల్లో ముందంజలో జిల్లా



మాచారెడ్డి మండలం అంతంపల్లిలో భూభారతి దరఖాస్తుపై క్షేత్ర స్థాయిలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంగ్వాన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ బాధ్యతలు చేపట్టి సోమవారంతో ఏడాది పూర్తవుతోంది. ఏడాది కాలంలో ఆయన జిల్లాపై తనదైన ముద్ర వేశారు. బాధ్యతలు చేపట్టిన తొలిరోజు నుంచే జిల్లా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. విధులలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలకూ వెనుకాడకుండా పాలనను గాడిలో పెట్టే ప్రయత్నం చేశారు. రోజూ ఏదో ఒక ప్రాంతాన్ని చుట్టేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయడం ద్వారా ఆయా వ్యవస్థలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ రంగాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపడంలో ఆయన కృషి ఎంతో ఉంది.

ఆశిష్ సంగ్వాన్ గతేడాది జూన్ 16న కామారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన తొలి రోజే అధికారులతో వివిధ అంశాలపై సమీక్షలు చేసి అన్నింటా ముందుండేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ దూకుడును గమనించిన అధికారులు, ఉద్యోగులు చాలా మంది బాధ్యతగా పనిచేయడం అలవాటు చేసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న వేలాది ధరణి ఫైల్స్‌ను పరిష్కరించేందుకు కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతిని తీసుకువచ్చి పైలట్ ప్రాజెక్టుగా లింగంపేట మండలాన్ని ఎంపిక చేయగా.. అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించి రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు మొదలుపెట్టారు. అప్పటికప్పుడు కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇంకా చాలా సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. అలాగే భూభారతిని అన్ని మండలాలకు విస్తరించే క్రమంలో ఆయా మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.

పత్రికా కథనాలపై స్పందన

అవినీతి, అక్రమాలు, సమస్యలపై పత్రికల్లో వచ్చే కథనాలపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిరోజూ పత్రికల్లో వచ్చే కథనాలపై కలెక్టర్ స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిపైనా సమీక్షిస్తున్నారు. ఈ సమీక్షలో ఎందుకు సమస్యలు పరిష్కారం కాలేదో అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. రెగ్యులర్‌గా కొనసాగుతోంది.

ప్రజావాణికి ప్రాధాన్యత

తమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను ఆలకించేందుకు కలెక్టర్ దాదాపు ప్రతి వారం అందుబాటులో ఉంటున్నారు. స్వయంగా దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. మండల స్థాయిలో పరిష్కారం అయ్యే కొన్ని సమస్యలను అక్కడికక్కడే జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నారు. ప్రజావాణికి ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పనిసరి హాజరవుతున్నారు. దీంతో అదే రోజు సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు.

బయోమెట్రిక్‌తో సమయపాలన

కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయడంతో ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తున్నారు. వేలిముద్ర వేయడంలో ఆలస్యమైతే దానిపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకునేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో అధికారులు, ఉద్యోగులు ఎవరైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల్లో పలువురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు.

రక్తదాన కార్యక్రమాల్లో అగ్రభాగం

ఆపదలో ఉన్న వ్యక్తులకు అవసరమైన రక్తం సేకరించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా పెద్ద సంఖ్యలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్ సంగ్వాన్ బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డును అందుకున్నారు. రక్తదాతలను ప్రోత్సహించడం, ఎక్కువ మొత్తంలో రక్తం సేకరించడం ద్వారా జిల్లా ముందు వరుసలో నిలిచింది.

బడికో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నియామకం

పాఠశాలల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఆరోపణలు పెరిగిన నేపథ్యంలో కలెక్టర్ సంగ్వాన్ ప్రతి పాఠశాలలో ఒక టీచర్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌గా నియమించారు. విద్యార్థులు వేధింపులకు గురి కాకుండా ఉండేలా చర్యలు తీసుకున్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. అన్ని పాఠశాలల్లో నియమించి పర్యవేక్షించారు.

వేగంగా సామాజిక కులగణన

రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ, ఆర్థిక, సామాజిక కులగణన చేపట్టిన సందర్భంలో కామారెడ్డి జిల్లాలో గణన వేగంగా జరిగింది. రాష్ట్ర స్థాయిలో కామారెడ్డి జిల్లాకు గుర్తింపు లభించింది. కలెక్టర్ సంగ్వాన్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహించి సర్వే పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో వేసవి సీజన్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి అనేక చర్యలు తీసుకున్నారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి అధికారులను పంపించి వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు.

విద్య, వైద్యంపై ఫోకస్

జిల్లాలో విద్య, వైద్యం మెరుగుపడేలా అనేక చర్యలు తీసుకున్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లినపుడు ఆయా ప్రాంతాల్లో స్కూళ్లు, కాలేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను తనిఖీ చేయడం ద్వారా తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఇంటర్, టెన్త్ రిజల్ట్స్‌పై అధికారులతో రివ్యూ చేసి మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో సమస్యలపై చర్యలు తీసుకున్నారు.



దోమకొండ మండలం సంఘమేశ్వర్‌లో రెవెన్యూ సదస్సులో దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

పలు అంశాల్లో ప్రగతి

రైతులు పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. వరుసగా రెండు పంటలకు సంబంధించి కొనుగోళ్లలో ఈ ఘనత సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలోనూ కలెక్టర్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ పనుల్లో వేగం పెరిగేలా చూస్తున్నారు.

లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి

నిజామాబాద్‌నాగారం: లక్ష్య సాధన కోసం కష్టపడుతూ ముందుకు సాగితే ఫలితం దక్కుతుందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించిన తెలంగాణలోని 11 జిల్లాలకు చెందిన 200 మందికి ఎమ్మెస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 10వేల చొప్పున ప్రోత్సాహకాలు అందజేశారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా కష్టపడి చదివిన విద్యార్థులకు ఎమ్మెస్సార్ ట్రస్ట్ నగదు ప్రోత్సాహకాలు అందజేసిందన్నారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం పైతరగతులకు వెళ్తున్న విద్యార్థులు కొత్త పరిచయాలను తమ ఉన్నతి కోసం వాడుకోవాలని సూచించారు. చెడు పరిచయాలకు దూరంగా ఉండాలని, మత్తుపదార్థాలకు అలవాటు పడొద్దన్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం సాంబశివారెడ్డి, డైరెక్టర్లు ధనుష్‌రెడ్డి, జి.రాజిరెడ్డి, డాక్టర్ అబ్బాపూర్ రవి, వడ్డె శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సీపీ సాయిచైతన్య, ఎమ్మెస్సార్ ట్రస్ట్ సభ్యులు

రైతు నేస్తం మరింత చేరువ!



- మరో 47 రైతు వేదికల్లో వీసీ యూనిట్‌ల ఏర్పాటు
- ప్రతి మంగళవారం కార్యక్రమాల నిర్వహణకు అవకాశం
- నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం

కామారెడ్డి క్రైం : రైతు నేస్తం కార్యక్రమాన్ని మరింత చేరువ చేయడానికి సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మరో 47 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టం యూనిట్‌లను ఏర్పాటు చేశారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించే కార్యక్రమంలో వీటిని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల మధ్య నిర్వహించే వీసీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా కోరారు.

72 రైతువేదికల్లో వీసీ యూనిట్లు..

జిల్లాలో గతంలో 25 రైతుల వేదికల్లో మాత్రమే వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌లు ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లాకు మరో 47 యూనిట్‌లు మంజూరు చేసింది. దీంతో జిల్లాలో మొత్తం 72 రైతు వేదికలకు వీసీ యూనిట్‌లు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను ప్రసారం చేసే ఉద్దేశంతో వీసీ యూనిట్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు, సాగులో మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన సాగు పద్ధతులు, సాంకేతికతను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సందేహాలను వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు నివృత్తి చేస్తారు. పంటల సాగులో అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారు.

భూసమస్యలకేదీ పరిష్కారం!

భూభారతితోనూ తీరని సమస్య

- పైలట్ ప్రాజెక్టు మండలంలో 4,225 దరఖాస్తులు
- అరకొరగానే పరిష్కారాలు..
- తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధిత రైతులు

లింగంపేట : ధరణిలో లోపాలతో వేలాది మంది రైతులు ఇబ్బందిపడ్డారు. రికార్డులలో తప్పుగా నమోదవడంతో సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. వాటిని సరి చేసేందుకు మాడ్యూల్స్ లేకపోవడంతో ఏళ్ల తరబడిగా తహసీల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రస్తుత ప్రభుత్వం ధరణిని రద్దు చేసి, భూభారతి చట్టం తీసుకువచ్చింది. అయితే ఈ చట్టంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న బాధిత రైతులకు నిరాశే మిగులుతోంది. నెలలు గడుస్తున్నా సమస్యలు అపరిష్కృతంగానే ఉండడంతో నిట్టూరుస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో లింగంపేట మండలం ఒకటి. మండలంలో ఏప్రిల్‌లో భూభారతి సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. 4,225 దరఖాస్తులు వచ్చాయి. అనంతరం సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించాయి. దీర్ఘకాలంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ఎక్కువగా అసైన్‌మెంట్ భూములు, రెవెన్యూ, అటవీ శాఖ మధ్య వివాదాలకు సంబంధించినవే ఉన్నాయి. వీటిని ఇరు శాఖల సమన్వయంతో సర్వే నిర్వహించి పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. కానీ రెండు నెలలు గడుస్తున్నా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. మండలంలో 4,225 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 600 లోపే పరిష్కరించారు. ఇందులో పేర్లు సరి చేయడం, మిస్సింగ్ సర్వే నంబర్లు, భూమి ఆన్‌లైన్‌లో నమోదు కానివి, సాదాబైనామాలు, వారసత్వం భూములు తదితర సమస్యలు సరిచేశారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను రెవెన్యూ అధికారులు పక్కన పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతలు, తండ్రులనుంచి వారసత్వంగా వచ్చిన భూముల సమస్యలూ పరిష్కారానికి నోచుకోవడం లేదు. అలాగే ఒకే సర్వే నంబర్‌లో పలువురు రైతుల భూములు ఉండగా.. ధరణి పోర్టల్ తీసుకువచ్చాక అందులో ఒకరి భూమి మరొకరిపై నమోదయ్యింది. వన్ 'బి', అడంగల్ పహణీలో ఒకరి పేరు ఉంటే ధరణిలో ఇచ్చిన పాసు బుక్కులో మరొకరి పేరుపై రావడంతో రైతులు రైతుబంధు, రైతు భరోసా, రైతు బీమాలకు దూరమయ్యారు. సమస్యలు పరిష్కారం కాని రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి విచారణ చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.



ధరణికి ముందు పాస్‌బుక్కులో నమోదైన భూమి వివరాలు



ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన పాస్‌బుక్కులో రెండెకరాలే నమోదైన దృశ్యం

33 ఏళ్లుగా సాగు చేస్తున్నా



1992లో ఎర్రాపహడ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి 2.20 ఎకరాల భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నా. అడంగల్ పహణీలో నా పేరుపైనే ఉండేది. 2016–17 సంవత్సరంలో నాకు భూమి అమ్మిన వ్యక్తుల పేరుపైకి మార్చారు. ఈసీలో మాత్రం సత్యంనాయుడు పేరే చూపిస్తుంది. ఈ సమస్యపై భూభారతిలో దరఖాస్తు చేసుకున్నా. అధికారులు నా భూమి నాకు వచ్చేలా చూడాలి.

– సత్యంనాయుడు, బూరుగిద్ద

ప్రభుత్వ పథకాలు అందడంలేదు



సర్వే నంబర్ 326/అలో నాలుగు ఎకరాల భూమి ఉంది. నాకు వారసత్వంగా వచ్చిన భూమి ఇది. ధరణి వచ్చాక అదే సర్వే నంబరులో ఉన్న దేమాంగు సిద్దవ్వ పేరుపైకి రెండు ఎకరాలు మారింది. అదే సర్వే నంబర్‌లో బొల్ల సాయిలు పేరుతో ఎకరం భూమి వచ్చింది. 1బి, పహణీలో నా పేరు చూపిస్తున్నా ఆన్‌లైన్‌లో పట్టా మాత్రం ఇతరుల పేరుపై చూపిస్తోంది. నా సమస్య పరిష్కరించాలి.

– పూరం మల్లయ్య, మోతె

అధికారులు న్యాయం చేయాలి



మోతె శివారులోని 324 సర్వే నంబర్‌లో నాకు 2.33 ఎకరాల భూమి ఉంది. ధరణి పాసుబుక్కులో 33 గుంటల భూమే నమోదయ్యింది. వారసత్వంగా వచ్చిన రెండెకరాలు నమోదు కాలేదు. అదే సర్వే నంబరులోని ఆవుల రాజయ్య పేరుతో రెండు ఎకరాలు వచ్చింది. నా భూమి ఇతరుల పేరుపై నమోదు కావడంతో సంక్షేమ పథకాలకు దూరమయ్యాను. అధికారులు న్యాయం చేయాలి.

– మచ్చ సతీశ్, మోతె

కొందరికే కిసాన్ సమ్మాన్ నిధి

- కొత్తవారికి అందని పథకం
- కఠిన నిబంధనలతో వేలాది మంది లబ్ధికి దూరం



ఎల్లారెడ్డి : రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన తక్కువ మంది రైతులకే వర్తిస్తోంది. 2019 ఫిబ్రవరిలో ఈ పథకం ప్రారంభమైంది. 2019 జనవరి 31 కంటే ముందు భూముల పట్టాలు కలిగిన అర్హులైన రైతులు ఈ పథకం పొందేందుకు అర్హులని కేంద్రం ప్రకటించింది. ఈ పథకం కింద నమోదైన రైతులకు ప్రతి నాలుగు నెలలకు రూ. 2 వేల చొప్పున అందిస్తున్నారు. ఇప్పటివరకు 19 విడతల్లో పెట్టుబడి సాయం అందింది. 2019 జనవరి 31 తర్వాత పట్టాలు పొందిన రైతులలో చాలా మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరడం లేదు.

తగ్గుతున్న లబ్ధిదారులు

కేంద్రం నిబంధనలను కఠినంగా అమలు చేస్తుండడంతో కిసాన్ సమ్మాన్ నిధి పథకం లబ్ధిదారుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ పథకం ప్రారంభించిన కొత్తలో జిల్లాలో 1,67,970 మంది రైతులకు లబ్ధి చేకూరింది. ప్రస్తుతం వీరి సంఖ్య 96,725కు తగ్గింది. ఆదాయపు పన్ను చెల్లించేవారు, నకిలీ పత్రాలతో పట్టాలు పొందిన వారు, గిఫ్ట్ డీడ్ కింద పట్టాలు పొందిన వారసులను ఈ పథకానికి అనర్హులుగా ప్రకటించడంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గింది. అందరికీ కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధి చేకూరేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పీఎం కిసాన్ వస్తలేదు..

2019 ఫిబ్రవరిలో పట్టా చేసుకున్నా. నాకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు రావడం లేదు. అధికారులను ఎన్నిమార్లు అడిగినా వస్తాయని చెబుతున్నారు తప్ప డబ్బులు మాత్రం ఖాతాలో జమకావడం లేదు.

– విఠల్, రైతు, ఎల్లారెడ్డి

కొత్తవారికి మంజూరు లేదు..

2019 జనవరి 31 తర్వాత భూములు కొనుగోలు చేసినవారికి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి అందడం లేదు. వారసత్వంగా భూమి వచ్చినవారికి మాత్రమే వస్తోంది. కొత్తవారికి అమలు కావడం లేదు.

– అనిల్ కుమార్, ఇన్‌చార్జి ఏడీఏ, ఎల్లారెడ్డి

క్లుప్తంగా

స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి



కామారెడ్డి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి సూచించారు. ఇటీవల ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని జంగంపల్లి, భిక్కనూర్ గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు ఆయనను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుపొందాలని సూచించారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. జంగంపల్లి మాజీ ఎంపీటీసీ పుల్లూరి రామస్వామి, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నరసింహులు, తదితరులున్నారు.

మొక్కలు నాటిన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఫాదర్స్ డే సందర్భంగా గుర్తుగా మొక్కలు నాటినట్టు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎం.జైపాల్‌రెడ్డి, పి.రాజేశ్వరరావు, పాత హన్మాండ్లు, పంపరి శ్రీనివాస్, భాస్కర్, రాజనర్సింహారెడ్డి తదితరులున్నారు.

ముంబోజీపేటతండాలో.. యువకులు




లింగంపేట(ఎల్లారెడ్డి): ముంబోజీపేట తండాలో యువకులు మొక్కలు నాటారు. ఐదేళ్ల నుంచి తండా పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నట్లు వారు వెల్లడించారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. తండాకు చెందిన ఉద్యోగులు, యువకులు స్వయంగా మొక్కలు కొనుగోలు చేసి నాటినట్లు పేర్కొన్నారు.

అధిక వడ్డీలు.. వేధింపులు

- పల్లెల్లో మితిమీరిపోతున్న మైక్రో ఫైనాన్స్ ఆగడాలు
- తీవ్ర ఆందోళన చెందుతున్న బాధితులు

రామారెడ్డిలోని రమేష్ అనే వ్యక్తి ఇటీవల అవసరానికి మైక్రో ఫైనాన్స్ వారం గ్రూప్‌లో రూ.10వేలు అప్పు తీసుకున్నాడు. వారం వారం చెల్లింపుల్లో తేడా రావడంతో సదరు ఏజెంట్లు రాత్రి 10గంటల వరకు వేచి ఉండి వారం తాలూకా కిస్తీ పైసలు వసూలు చేసుకువెళ్లారు. రూ.పదివేలు తీసుకుంటే వడ్డీతో కలిపి రూ.17,000 వరకు మైక్రో ఫైనాన్స్ వారు వసూలు చేయడంతో అతడు తీవ్ర ఆవేదన చెందుతున్నాడు.



రామారెడ్డి: పల్లెల్లో మళ్లీ మైక్రో ఫైనాన్స్ సంస్థలు మహిళలు, చిరు వ్యాపారులకు రుణాలు ఇస్తూ వారిని నిండా ముంచుతున్నారు. ప్రజల అత్యవసరాన్ని ఆసరా చేసుకొని అధిక వడ్డీకి రుణాలు ఇచ్చి తీరా ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోతే వేధింపులకు గురిచేస్తున్నారు. గతంలో మైక్రో ఫైనాన్స్ వేధింపులు తాళలేక ఎంతో మంది ఆత్మహత్య చేసుకున్న ఘటనలు జిల్లాలో ఉన్నాయి. అప్పట్లో ప్రభుత్వం వీటిని నిషేధించింది. కానీ మళ్లీ గ్రామాల్లో మైక్రో ఫైనాన్స్ సంస్థలు తమ కార్యకలాపాలు వేగంగా విస్తరింపజేస్తున్నాయి.

వాయిదా చెల్లింపులు..

మైక్రో ఫైనాన్స్ నిర్వాహకులు ముందుగా తమ ఏజెంట్లను గ్రామాల్లోకి పంపి పేద మహిళలు, సంఘాల సభ్యులను కలుస్తున్నారు. వారం, 15 రోజుల వాయిదా చెల్లింపులతో రుణాల ఆశ చూపుతున్నారు. డ్వాక్రా గ్రూపుల్లో సకాలంలో చెల్లించని వారు మైక్రోసంస్థలను ఆశ్రయిస్తున్నారు. 10నుంచి 12మంది మహిళలను గ్రూపుగా ఏర్పాటు చేసి 15 రోజుల్లోనే రుణం అందిస్తున్నారు.

ఒక్కో గ్రామంలో 20 నుంచి 30 గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు పొందినట్లుగా తెలుస్తుంది. కామారెడ్డి జిల్లాలో రామారెడ్డి, సదాశివనగర్ భిక్కనూరు, దోమకొండ, బీబీపేట మండలాల్లో ఈ తరహా రుణాలు ఎక్కువగా ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈజీగా రుణం వస్తుండడంతో మహిళలు వీటికి ఆకర్షితులు అవుతున్నారు. తీరా ఆర్థిక ఇబ్బందులతో ఈఎంఐ చెల్లించకపోతే వేధింపులకు గురిచేస్తున్నారు. గ్రామాలలో మైక్రో ఫైనాన్స్ తమ కార్యకలాపాలను విస్తరిస్తున్న సంబంధిత అధికారులు నిలువరించడంలో విఫలమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా వడ్డీ వ్యాపారులపై దాడులు చేసి కేసులు నమోదు చేసిన పోలీసులు మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఎందుకు నిలువరించడం లేదని అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మైక్రో ఫైనాన్స్ సంస్థలు నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



డ్వాక్రా సంఘాల మహిళలు ఎవరూ కూడా మైక్రో ఫైనాన్స్ రుణాలు తీసుకోవడం లేదు. మైక్రో ఫైనాన్స్ సంస్థలపై, వారి ఆగడాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాలలో ప్రజలు రుణాల కోసం మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించవద్దు.

– భూమాగౌడ్, సీసీ, డ్వాక్రా సంఘం, రామారెడ్డి

పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



పాందుర్తిలో ముదిరాజ్ కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

రాజంపేట: మండలంలోని తలమడ్ల, పాందుర్తి గ్రామాల్లో ఆదివారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పర్యటించారు. గౌడ సంఘం, ముదిరాజ్ సంఘం పెద్దల ఆహ్వానం మేరకు రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజా కార్యక్రమం, ముదిరాజ్ సంఘ కల్యాణ మండపం ప్రారంభం, హనుమాన్ ఆలయంలో పూజా కార్యక్రమం, తలమడ్లలో రజక సంఘం శ్రీ మడివేలు మాచయ్య స్వామి సీతాదేవి కళ్యాణ మహోత్సవం సందర్భంగా పూజలో పాల్గొన్నారు.

కామారెడ్డి: కామారెడ్డి మండలం ఉగ్రవాయిలో కుర్మ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు ఆదివారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బీరప్ప ఆలయంలో పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించారు.

బాన్సువాడలో సైబర్ మోసం

బాన్సువాడ: బాన్సువాడ సైబర్ మోసం చోటు చేసుకుంది. బాన్సువాడ సీఐ అశోక్ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని అర్బత్ కాలనీకి చెందిన సయ్యద్ రఫీ బ్యాంకు ఖాతా నుంచి ఈనెల 5న రెండుసార్లు రూ.20 వేలు కట్ అయ్యాయి. మరుసటి రోజు రఫీ బంధువు తన ఖాతాకు రూ. లక్ష 30వేలు వేసాడు. 6న సాయంత్రం వరకు రూ. లక్ష 30వేలు రఫీ ఖాతాలోనే ఉండడంతో 7న మరొకరి రూ. లక్ష ఫోన్‌పే చేద్దామని చూడగా అప్పటికే రూ. లక్ష కట్ అయ్యాయి. దీంతో అనుమానం వచ్చి రఫీ బ్యాంకుకు వెళ్లగా పోలీసులను ఆశ్రయించాలని బ్యాంకు ఉద్యోగులు సూచించారు. దీంతో అతడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని స్థానిక షాదీఖానాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కామారెడ్డి జిల్లా నాయక్‌పోడ్ సామాజిక వర్గం విద్యార్థులను ఆదివారం నాయక్‌పోడ్ ఉద్యోగ సంఘం నాయకులు సన్మానించారు. ఎస్సెస్సీ, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన 27 మందిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిలు, నేతలు పెంటయ్య, వెంకట్, బాలు, సంజీవు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడు చేసిన లింగం

మీకు తెలుసా?

సిరికొండ మండల పరిధిలోని దట్టమైన లొంక అడవుల్లో కొలువైన నీలకంఠ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది.



ఇసుక లింగం



లొంకలోని రామలింగేశ్వరస్వామి ఆలయం

- త్రేతాయుగంలో రావణుడు సీతమ్మను అపహరించగా, శ్రీరాముడు వెతుకుతూ ఈ అడవుల్లోకి వచ్చినట్లు పురాణాలు చెబుతున్నాయి.
- రాత్రికి అడవిలోనే బస చేసిన శ్రీరాముడు ఉదయం పూజ చేసుకోవడానికి సెలయేరులో నుంచి ఇసుకను తీసుకువచ్చి లింగం చేసి పూజలు చేసినట్లు తెలుస్తోంది.
- శ్రీరాముడే స్వయంగా చేసిన లింగం కావడంతో రామలింగేశ్వరస్వామి ఆలయంగా పేరు పొందింది.
- మండల కేంద్రం నుంచి 8కిలోమీటర్ల దూరంలో గల అడవుల్లో ఈ ఆలయం ఉంది. ఆలయం చుట్టు ఎత్తై గుట్టలు, పక్కన సెలయేరుతో ఎంతో ఆహ్లాదభరితంగా ఉంటుంది.
- మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు.

– సిరికొండ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆర్టీసీ డిపో మేనేజర్ల నంబర్లు

ఆర్టీసీ డిపో	ఫోన్ నంబర్		
నిజామాబాద్ ఆర్ఎం	9959226011	నిజామాబాద్–1 డీఎం	9959226016
ఆర్మూర్ డీఎం	9959226019	నిజామాబాద్–2 డీఎం	9959226017
బోధన్ డీఎం	9959226001	కామారెడ్డి డీఎం	9959226018
		బాన్సువాడ డీఎం	9959226020

నిలిచిన చెక్‌డ్యాం పనులు

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న వైనం
- మంజీరలో నీటి ప్రవాహంతో పనులకు బ్రేక్
- ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న స్థానికులు



బీర్కూర్ బ్రిడ్జి వద్ద నిలిచిన చెక్‌డ్యాం నిర్మాణ పనులు (ఫైల్)

బాన్సువాడ : బీర్కూర్ వద్ద మంజీర నదిలో కొనసాగుతున్న చెక్ డ్యాం నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. వర్షాల కారణంగా మంజీర నదిలో నీటి ప్రవాహం ప్రారంభమైంది. దీంతో చెక్ డ్యాం పనులకు ఆటంకం ఏర్పడడంతో నిర్మాణ పనులను నిలిపివేశారు. బీర్కూర్ మంజీరలో చెక్ డ్యాం పనులు ఒక్క అడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కి అన్నట్లు కొనసాగుతున్నాయి. పనులు ప్రారంభించి నాలుగేళ్లు అవుతున్న చెక్ డ్యాం పనులు మందకొడిగా సాగుతూనే ఉన్నాయి. అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి మంజీర నదిపై చెక్ డ్యాం నిర్మించాలని నాబార్డు నిధులు రూ.28.29 కోట్లతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా 28 జనవరి 2021లో శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లుగా పనులు కొనసాగు..తూనే ఉన్నాయి. గత మే 22న ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ చెక్ డ్యాం నిర్మాణ పనులను పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు పూర్తయితే బీర్కూర్‌తో పాటు కిష్టాపూర్, బరంగెడ్గి, డోంగ్లీ మండలం కుర్లా, శేట్లూర్, ఖడ్గాం గ్రామాలకు భూగర్భ జలాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.

పోలీస్ సిబ్బంది సేవలు ఆదర్శం



సన్మానం పొందిన పోలీసు సిబ్బందితో భిక్కనూరు సీఐ సంపత్ కుమార్

భిక్కనూరు: పోలీస్ సిబ్బంది అందించిన సేవలు ఎంతో ఆదర్శమని భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్ అన్నారు. సర్కిల్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేసి బదిలీ అయిన సిబ్బందిని ఆదివారం సర్కిల్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. మంచిగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆలయంలో చోరీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండా జగదాంబ ఆలయంలో చోరీ జరిగినట్లు తండావాసులు ఆదివారం తెలిపారు. ఆలయంలో శనివారం పూజలు చేసి వెళ్లిన పూజారి దుష్యానాయక్ ఆదివారం ఉదయం గుడిని తెరిచేందుకు వెళ్లగా ఆలయంలోని హుండీ బయట ఉండటాన్ని గమనించి తండావాసులకు సమాచారం ఇచ్చారు. హుండీని పరిశీలించిన తండా వాసులు అందులో సుమారు రూ. 30వేల నగదు ఉన్నదని, గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారన్నారు. ఘటనపై వారు పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షాపు యజమానిపై కత్తితో దాడి

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో బట్టల షాపు నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్త షేక్ ఖలీల్‌పై ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేశాడు. బట్టలు కొనుక్కోడానికి వచ్చిన నిందితుడికి ఖలీల్ బట్టలు చూపిస్తుండగా హఠాత్తుగా కత్తితో దాడి చేసి పారిపోయాడు. షాపులో ఉన్న వర్కర్లు, స్థానికులు వెంటనే గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్పృహకోల్పోయిన ఖలీల్‌ను వెంటనే చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిని పట్టుకుంటామని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు.

కొడుకును చంపిన కేసులో తండ్రి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ రవీందర్‌నాయక్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భార్యపై కోపంతో కొడుకును హతమార్చిన కేసులో తండ్రిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామానికి చెందిన అక్షితకు, లింగంపేట మండలం పొల్కంపేట గ్రామానికి చెందిన నర అనిల్‌కు కొన్నేళ్ల కిందట వివాహం జరుగగా, వారికి నాలుగేళ్ల శశాంక్ అనే కొడుకు, 7నెలల కూతురు మనుశ్రీ ఉన్నారు. కాగా ఈనెల 10న అనిల్ తన భార్య, పిల్లలతో కలిసి మెదక్ జిల్లా శాలీపేటలో జరిగిన బోనాల పండుగకు వెళ్లాడు. అక్కడ ఓ గొడవ జరగడంతో అనిల్ తన కుటుంబంతో కలిసి పొల్కంపేటకు చేరుకున్నాడు. ఇంటికి వచ్చాక మరోసారి గొడవ జరగగా అనిల్ తన భార్యను కొట్టాడు. ఈ నెల 12న అనిల్ తన భార్యను పోచారంలో దింపి కొడుకు శశాంక్‌ను బైక్‌పై ఎక్కించుకొని గ్రామశివారులోని పల్లెప్రకృతివనం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ భార్యపై కోపంతో శశాంక్ నోరు, ముక్కు మూసి హత్య చేశాడు. అనంతరం కొడుకును పోచారంలోని తన అత్తగారింటికి తీసుకువచ్చి ఇంట్లో పడుకోబెట్టి వెళ్లిపోయాడు. అచేతనంగా ఉన్న కొడుకును చూసిన అక్షిత అనుమానంతో వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే బాలుడు మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. దీంతో తన కొడుకును హత్య చేశాడని తల్లి అక్షిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మెదక్ జిల్లా బూర్గుపల్లి గేట్ వద్ద అనిల్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించగా తానే కొడుకును హత్య చేసినట్లు అంగీకరించాడు. అతడి బైక్‌ను స్వాధీనం చేసుకొని అనిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై మల్లారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీశైలం, హోంగార్డ్ కాశయ్యపాల్గొన్నారు.

గంజాయి పట్టుకుని వదిలేసిన ఎస్సై!

ఖలీల్‌వాడి: ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల రెండు గ్రామాల్లో ఆరుగురి దగ్గర పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆలస్యంగా తెలిసింది. ఈ ఆరుగురిలో మైనర్ బాలురు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే గంజాయి లభించిన తర్వాత ఎస్సై ఓ నలుగురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ ఎస్సై వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న తర్వాత కేసు కాకుండా ఉండేందుకు సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఓ ప్రజాప్రతినిధి వద్దకు ఈ వ్యవహారం వెళ్లడంతో కేసు లేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలోని మరో గ్రామంలో ఇద్దరు గంజాయితో పట్టుబడినట్లు తెలిసింది. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న ఎస్సై వారిని పీఎస్‌కు పిలిపించుకుని తిప్పుకున్నారు.

తర్వాత వారి వద్ద చేతివాటం ప్రదర్శించారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సదరు ఎస్సై భూ పంచాయితీలను పీఎస్‌లోనే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పీఎస్ పరిధిలో గంజాయి అక్రమ దందా కొనసాగుతుందనే ఆరోపణలు గతం నుంచి ఉన్నాయి. విద్యార్థులను తనిఖీలు చేయరని గంజాయి సప్లైదారులు వారితో నిజామాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తుప్పు పడుతున్న వాహనాలు



బిచ్కుంద(జుక్కల్): వివిధ కేసులలో పోలీసులు పట్టుకున్న వాహనాలను బిచ్కుంద ఎక్సైజ్, పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. ఏళ్లుగా కేసులు విచారణలో ఉండడంతో వాహనాలు అలాగే ఉండి పూర్తిగా చెడిపోతున్నాయి. నాటుసారా, గంజాయి, రోడ్డు ప్రమాదాలు, ఇతర సరుకుల అక్రమ రవాణా, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను, దొంగలు చోరీలకు పాల్పడి పట్టుబడ్డ వాహనాలను పోలీసులు సీజ్ చేస్తున్నారు. కేసుల విషయంలో కోర్టు వరకు పోవడం, తీర్పు వచ్చేవరకు సమయం పడుతుండటంతో వాహనాలు స్టేషన్ ఆవరణలో పాడవుతున్నాయి. వాహనాలపై అధికారుల నిఘా లేకపోవడంతో విడిభాగాలు మాయమవుతున్నాయి. దీంతో సంబంధిత వాహనదారులు వాటిని తీసుకెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు తుప్పుపట్టిన వాహనాలను తీసుకెళ్లేందుకు ముందుకురావడం లేదు. ఈక్రమంలో అధికారులు పట్టుకున్న వాహనాలకు వేలం వేస్తే ప్రభుత్వానికి ఎంతో కొంత ఆదాయం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆత్మీయ పలకరింపులు.. మధుర స్మృతులు

- జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు



నగరంలో సమావేశమైన ఉమ్మడి జిల్లాలోని 2000 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు

సాక్షి నెట్‌వర్క్: ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తంచేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే నగరంలోని ఓ హోటల్‌లో ఉమ్మడి జిల్లాలోని 2000 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కామారెడ్డిలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల 1999–2001 బ్యాచ్ బైపీసీ విద్యార్థులు పట్టణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.



కామారెడ్డిలోని సిద్ధార్థ జూనియర్ కళాశాల 1999-2001 బైపీసీ విద్యార్థులు



అన్నారం జెడ్పీహెచ్ఎస్ 2009-10 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



గోపాల్‌పేట జెడ్పీహెచ్ఎస్ 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



నిజామాబాద్‌లోని గిరిరాజ్ డిగ్రీ కళాశాల 2002-05 బీఏ గ్రూప్ విద్యార్థులు..



ఎల్లారెడ్డిలో జెడ్పీహెచ్ఎస్ 1983-84 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల బైక్ ర్యాలీ



లింగంపేట జెడ్పీ (బాలుర) పాఠశాల 1989-90 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



నస్రుల్లాబాద్ జెడ్పీహెచ్ఎస్ 2006-07 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు